
సాక్షి
నల్లగొండ
గురువారం । 10 । అక్టోబర్ । 2024



యాదాద్రిలో ఆయుధ పూజ
విజయదశమిని పురస్కరించుకొని బుధవారం యాదాద్రిలో అర్చకులు ఆయుధ పూజ నిర్వహించారు. - 10లో



కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి 1498 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. - 10లో



కట్టుకున్నోడే కాలయముడు
సాగర్ ఎడమ కాల్వలో గల్లంతై మృతిచెందిన అంగన్‌వాడీ టీచర్‌ను ఆమె భర్తే హత్య చేశాడు. - 10లో

న్యూస్‌రీల్

నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శన చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సంఘాలు

నల్లగొండ టౌన్ : ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పును స్వాగతించి ప్రతి నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి 11,062 టీచర్ పోస్టులను ఎస్సీ వర్గీకరణ లేకుండా అమలు చేయడం మాదిగ జాతికి చేసిన ద్రోహమే అన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గోడపర్తి జానకి రామయ్యచౌదరి, బకరం శ్రీనివాస్, ఇరిగి శ్రీశైలం, గాదె రమేష్, మల్లెపాక వెంకన్న, కొంపెల్లి భిక్షపతి, ఆడపు నాగార్జున, మేడి శంకర్, మచ్చ ఏడుకొండలు పాల్గొన్నారు.

యాదాద్రిలో శ్రీసుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం నిత్యపూజలు విశేషంగా కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం వంటి సంప్రదాయ పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా శ్రీసుదర్శన నారసింహ హోమం జరిపారు. తర్వాత గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం జరిపించి, ద్వారా బంధనం చేశారు.

పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. సోమయ్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విద్యా కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా రాష్ట్రంలో విద్యా పాలసీని అమలు చేసి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన, సమానమైన విద్యను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచేలోపు పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలన్నారు. నూతన పీఆర్సీలో కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ పే వర్తించేలా సిఫారసు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ .అనిల్ కుమార్, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జె.యాకయ్య, ఎ. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన డీఎస్సీ అభ్యర్థులు



నియామక పత్రాలు తీసుకునేందుకు వెళ్తూ విజయ సంకేతం చూపుతున్న డీఎస్సీ అభ్యర్థులు

నల్లగొండ : డీఎస్సీ–2024లో ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగులు నియామక పత్రాలను తీసుకునేందుకు బుధవారం హైదరాబాద్‌కు వెళ్లారు. నల్లగొండ ఎన్జీ కాలేజీ, మిర్యాలగూడ, దేవరకొండలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్‌లలో వారంతా తరలివెళ్లారు. ప్రతి బస్‌కు ఇన్‌చార్జి, పోలీస్ సిబ్బందిని వెంట పంపారు. సాయంత్రం ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా డీఎస్సీ ఎంపిక అభ్యర్థులు నియామక పత్రాలు అందుకున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చేతులు మీదుగా నియామక పత్రం తీసుకుంటున్న నల్లగొండ జిల్లాకు చెందిన రేణుక

బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ : సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మన ఆడబిడ్డల ఆత్మీయతను చాటే అపురూపమైన పూలపండుగ బతుకమ్మ అని.. తెలంగాణ సంప్రదాయలకు నిలువెత్తు ప్రతీక బతుకమ్మ పండుగ ఆయన కొనియాడారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా ప్రతి గ్రామంలో చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఎల్‌ఆర్‌ఎస్.. గందరగోళం

ఒక ఊరి దరఖాస్తులు మరో ఊరిలో..

- ఆన్‌లైన్ చేసే క్రమంలో ఇబ్బందులు
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు
- ఆందోళనలో దరఖాస్తుదారులు

గుర్రంపోడు మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన కొంతమంది ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారి పేర్లు భూదాన్‌పోచంపల్లిలో కనిపిస్తున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన క్షేత్రస్థాయి సిబ్బంది పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమస్యను ఏవిధంగా పరిష్కరించాలనే దానిపై స్పష్టత లేదు. ఒకవేళ ఆన్‌లైన్‌లో వాటిని మార్చేందుకు అవకాశం లేకపోతే అవి తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. ఇదీ చాలా చోట్ల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిస్థితి.



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) గందరగోళంగా తయారైంది. 2020లో అనధికార లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. అప్పట్లో న్యాయ వివాదాల కారణంగా ఆ ప్రక్రియ మూలన పడిపోయింది. ప్రస్తుతం ఆ వివాదాలు తొలగిపోవడంతో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసేందుకు శ్రీకారం చుట్టింది. కానీ.. ఇప్పుడు దరఖాస్తులు తారుమారు కావడంతో అర్జీదారులు ఆందోళన చెందుతున్నారు. ఒకే ఊరి పేరు రెండు చోట్ల ఉండడం, ఒక ఊరి దరఖాస్తులు మరో ఊరిలో కనిపిస్తుండడంతో ఆన్‌లైన్ చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనివల్ల క్షేత్రస్థాయిలో ప్లాట్లను పరిశీలించేందుకు అధికారుల బృందాలు వెళ్లిన సమయంలో కొందరి దరఖాస్తులు, మరికొందరి ప్లాట్ల వివరాలు కనిపించడం లేదు.

పంచాయతీల్లో 57,554 దరఖాస్తులు

రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం 2020లో పట్టణాలు, గ్రామాల్లో అనధికారిక ప్లాట్లు, లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసేందుకు దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తు ఫీజుగా రూ.వెయ్యిగా నిర్ణయించింది. జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలో 57,554 మంది ఆ ఫీజును చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం లేఅవుట్ల క్రమబద్ధీకరణకు పూనుకుంది. అందులో భాగంగా జిల్లాలో వచ్చిన దరఖాస్తులన్నింటిని గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శితో పాటు రెవెన్యూ ఆర్‌ఐ, ఇరిగేషన్ ఏఈలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. రెగ్యులరైజ్ కోసం దరఖాస్తు చేసుకున్న విధంగా ప్లాట్ లోకేషన్‌లో ఉందా లేదా, దానికి రోడ్డు ఉందా లేదా ఎవరు పేరు మీద ఉంది అనేది పంచాయతీ కార్యదర్శి పరిశీస్తున్నారు. రెవెన్యూ ఆర్‌ఐ ఆ ప్లాట్‌పై ఏవైనా కోర్టు కేసులు ఉన్నాయా లేవా అనేది పరిశీలిస్తారు. ఇరిగేషన్ శాఖ ఏఈ ప్లాటు ఏవైనా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉందా అనేది నిర్ధారించి అన్ని కరెక్టుగా ఉంటే ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ ప్లాటు 100 గజాలు ఉంటే ఉచితంగా, 300 గజాలు ఉంటే రూ.36 వేలు, 450 గజాలుంటే రూ.48 వేలు, 630 గజాలుంటే రూ.87 వేల ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తే సదరు దరఖాస్తుదారుడికి ఎల్‌ఆర్‌ఎస్ సర్టిఫికెట్లు ఇవ్వనున్నారు. నిబంధనల ప్రకారం లేని వాటిని తిరస్కరించనున్నారు.

15 రోజులుగా క్షేత్రస్థాయి పరిశీలన

ఎల్‌ఆర్‌ఎస్ కింద రెగ్యులరైజ్ కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన 15 రోజులుగా కొనసాగుతోంది. నాలుగేళ్ల క్రితం చేసిన దరఖాస్తులకు సంబంధించి ప్లాట్లు ఆన్‌లైన్‌లో కనిపించక గందరగోళ పరిస్థితి నెలకొంది. అవి ఎక్కడున్నాయో గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. దీంతో ఇప్పటివరకు 50 శాతం వరకు పరిశీలన కార్యక్రమం పూర్తయింది.

పంట నష్టపరిహారం రూ.10.24 కోట్లు

- ఎకరాకు రూ.10 వేల చొప్పున విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో ఆగస్టు నెలాఖరు, సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం బుధవారం నష్ట పరిహారం విడుదల చేసింది. ఒక్కో ఎకరానికి రూ.10 వేల చొప్పున ఇచ్చింది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో 10,242.34 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తేల్చింది. దానికిగాను 10,793 మంది రైతులకు రూ.10,24,18,500 విడుదల చేసింది. అందులో సూర్యాపేట జిల్లాలో 10,339 మంది రైతులకు సంబంధించిన 9829.22 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తేల్చింది. దానికింద రూ.9,82,85,000 విడుదల చేసింది. నల్లగొండ జిల్లాలో 454 మంది రైతులకు సంబంధించిన 413.12 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని, దానికి పరిహారంగా రూ.41,33,000 విడుదల చేసింది. ఈ మొత్తాన్ని వ్యవసాయ శాఖ రైతులకు అందించనుంది.

యాసంగి సాగు 5,83,620 ఎకరాల్లో ..

- సాగు ప్రణాళిక ఖరారు చేసిన వ్యవసాయ శాఖ
- ఈసారి భారీగా పెరగనున్న వరి
- విత్తనాలు, ఎరువుల కోసం ప్రతిపాదనలు



నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలం సీజన్ ముగిసింది. యాసంగి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ సాగు ప్రణాళికను ఖరారు చేసింది. గత యాసంగి సీజన్‌లో 4,44,041 ఎకరాల్లో వరి, వేరుశెనగ, పెసర తదితర పంటలు సాగు కాగా ప్రస్తుత యాసంగిలో 5,83,620 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కానున్నట్లు అంచనాలు వేసింది. ప్రస్తుతం సాగర్ ఎడమ కాల్వ, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు, సాగర్ వరద కాల్వల ద్వారా సాగునీటిని విడుదల చేయడంతో పాటు చెరువులు, కుంటల్లో నిండుగా నీరుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు వృద్ధి చెందడంతో పాటు కాల్వల ద్వారా నీరు సరఫరా అవుతున్నందున గత యాసంగిలో కంటే సుమారు 1,40,000 ఎకరాల్లో గత సాగు పెరిగే అవకాశం ఉన్నట్లు లెక్కలు వేశారు. దీంతో గత యాసంగి కంటే ఇప్పటి యాసంగి సీజన్‌లో వరి సాగు లక్షా 20 వేలకు పైగా ఎకరాల్లో పెరిగే అవకాశం ఉంది.

సాగు అంచనా ఇలా..

పంట	ఎకరాల్లో
వరి	5,56,920
సజ్జ	150
జొన్న	2,200
వేరుశెనగ	21,000
పెసర	2000
ఆముదం	350
మినుము	1000

1,39,230 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం

సాగుకు అనుగుణంగా విత్తనాల అంచనాను రూపొందించి రాష్ట్ర వ్యవసాయ శాఖకు నివేదించారు. వరి 1,39,230 (ఎంటీయూ 1010, ఆర్‌ఎన్‌ఆర్ 15048, కేఎన్ఎం 118, జీజేఎల్ రకాలు) క్వింటాళ్లు, మినుము 80 క్వింటాళ్లు, పెసర 160 క్వింటాళ్లు, వేరుశెనగ 22,059 క్వింటాళ్ల విత్తనాలు జిల్లాకు అవసరంగా అంచనా వేశారు.

ఎరువుల అంచనా ఇలా..

యాసంగి సీజన్‌కు 1,54,531 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరంగా వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. యూరియా 71,066 మెట్రిక్ టన్నులు, డీఏపీ 17,917, ఎంఓపీ 14,078, కాంప్లెక్స్ 44,303, ఎస్ఎస్‌పీ 7,167 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 1,54,531 మెట్రిక్ టన్నులు అవసరంగా అంచనాలు వేసి రాష్ట్ర వ్యవసాయ శాఖకు జిల్లా వ్యవసాయ శాఖకు నివేదిక పంపించింది. ఈ ఎరువులు ఈ నెల నుంచి మార్చి 2025 వరకు నెలనెలా విడతల వారీగా జిల్లాకు సరఫరా కానున్నాయి.

సాగు విస్తీర్ణం పెరగనుంది



ప్రస్తుతం జిల్లాలోని ప్రాజెక్టుల్లో సమృద్ధిగా నీటి నిల్వలు ఉన్నాయి. కాల్వల ద్వారా సాగుకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో వరి సాగు భారీగా పెరగనుంది. గత యాసంగి కంటే లక్షా 40 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

రైతులకు ఇబ్బంది కలగొద్దు



ఆర్జాలబావిలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

- సన్నాల సాగును ప్రోత్సహించేందుకే రూ.500 బోనస్
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఆర్జాలబావి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నల్లగొండ రూరల్ : రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ మండలంలోని ఆర్జాలబావి వద్ద గొల్లగూడ సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదలందరికీ సన్న బియ్యం అందించాలనే ఉద్దేశంతో సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించామన్నారు. రాష్ట్రంలో 53 శాతం సన్న వడ్లు పండుతున్నాయని ధనవంతులతో పాటు పేదలంతా సన్న బియ్యం తినాలనే ఉద్దేశంతో వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తామన్నారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని.. 22 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్ల రుణాలు మాఫీ చేసిందని.. రూ.2 లక్షలపైన రుణాలున్న వారికి మరో 10 రోజుల్లో రుణమాఫీ చేస్తుందన్నారు. ప్రభుత్వం వచ్చిన 10 నెలల్లో 70 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని పూర్తి చేస్తామన్నారు. పేదలకు రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని, ఇప్పటికే రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని తెలిపారు. బి.వెల్లెంల ప్రాజెక్టు ద్వారా డిసెంబర్‌లో చెరువు నింపుతామని.. ఆయా పనుల కోసం రూ.25 కోట్లు విడుదల చేశామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 9963407064కు తెలియజేయాలన్నారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర సరిహద్దు వాడపల్లి, నాగార్జునసాగర్‌లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నంరాజు, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, జేడీ శ్రవణ్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.



ధాన్యం తూకం వేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నెలాఖరులోగా సీఎంఆర్ చెల్లించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : గత వానాకాలం, యాసంగికి సంబంధించి సీఎంఆర్ చెల్లించే గడువును కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 31వ తేదీవరకు పొడిగించిందని మిల్లర్లు ఈనెలాఖరు నాటికి సీఎంఆర్ చెల్లించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం ఆయన తన చాంబర్లో రైస్ మిల్లర్లతో సీఎంఆర్, ధాన్యం సేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వానాకాలనికి సంబంధించి ఇంకా 12 వేల మెట్రిక్ టన్నులు, యాసంగికి సంబంధించి 72 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ చెల్లించాల్సి ఉందన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు రోజూ మిల్లుల నుంచి సీఎంఆర్ డెలివరీ అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రారంభమైనందున రైస్ మిల్లర్లు జాబితాను సమర్పించాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, మేనేజర్ హరీష్, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

టమాట.. సెంచరీ

భారీగా పెరిగిన కూరగాయల ధరలు

- రూ.వంద పలుకుతున్న టమాట, బీర, చిక్కుడు
- మిగతావి కూడా రూ.60 పైనే..
- వినియోగం పెరిగి, దిగుబడి తగ్గడమే కారణం





కూరగాయల ధరలు (కిలోకు రూ.లలో)ఇలా

నల్లగొండ టౌన్ : కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యుడికి అందనంతగా పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. గతవారం కంటే ఇప్పుడు రెండింతలు పెరిగాయి. దీంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. వారం కిలో టమాట ధర రూ.40 ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.వందకు పెరిగింది. మిగతా కూరగాయల ధర కూడా రోజురోజుకూ పెరుగుతోంది. ఉల్లిగడ్డ ధర వారం క్రితం కిలో రూ.40 నుంచి రూ.50 ఉండగా నేడు కిలో రూ.70 వరకు అమ్ముతున్నారు. నిత్యం కూరల్లో విధిగా వినియోగించే టమాట, ఉల్లిగడ్డల ధరలు పెరిగిపోవడం వల్ల ప్రజలు కూరలు వండుకోవాలంటేనే జంకే పరిస్థితి వచ్చింది.

పెరిగిన వినియోగం

దసరా పండుగ నేపథ్యంలో నిర్వహిస్తున్న దేవీనవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజలు నాన్‌వెజ్‌కు దూరంగా ఉంటున్నారు. దీనికి తోడు ప్రతి గ్రామంలో, పట్టణాల్లో అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. రోజూ అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. పండుగ సీజన్ కావడంతో చుట్టపక్కాలు ఇళ్లకు వస్తుంటారు దీనివల్ల కూరగాయల వినియోగం పెరుగుతోంది. దీంతో ధరలు ఏకంగా రెండింతలయ్యాయి. డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయాల దిగుబడి, దిగుమతులు లేని కారణంగా ధరలు పెరిగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

ధరలు పెరగడంతో తినలేని పరిస్థితి వచ్చింది



కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. రూ.500 తీసుకుపోతే రెండు రోజులకు కూడా సరిపోను కూరగాయలు రావడం లేదు. టమాట, బీరకాయ కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇంత ధరలు ఎన్నడూ చూడలేదు.

– స్వరూప, ఆర్జాలబావి, నల్లగొండ



సద్దులకు సిద్ధం | సద్దుల బతుకమ్మ వేడుక కోసం నల్లగొండలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



బతుకమ్మ సంబరం | బతుకమ్మ సంబరాల్లో భాగంగా బుధవారం రాత్రి నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న మెప్మా సిబ్బంది

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


అభిరాంయాదవ్

పెద్దవూర: మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇసురాజు వెంకటేశ్వర్లు, సువర్ణ దంపతుల కుమారుడు ఇసురాజు అభిరాంయాదవ్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉయ్యూరులో నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి సీబీఎస్ఈ క్లస్టర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో అభిరాంయాదవ్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపర్చడంతో ఈ నెల 14వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు తల్లిదండ్రులు బుధవారం తెలిపారు. అభిరాంయాదవ్‌ను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడిగా క్రిస్టోఫర్



వలిగొండ: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా వలిగొండ మండలం గోపరాజుపల్లికి చెందిన సంగిశెట్టి క్రిస్టోఫర్‌ను రెండోసారి నియమితులయ్యారు. బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ చేతులమీదుగా క్రిస్టోఫర్ నియామక పత్రం అందుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన వారికి క్రిస్టోఫర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

నాగారం వాసికి డాక్టరేట్


వందన

నాగారం: మండల కేంద్రానికి చెందిన కందుకూరి లక్ష్మయ్య, సుకన్య దంపతుల కుమార్తె వందనకు నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) బుధవారం డాక్టరేట్‌ను ప్రకటించింది. సైన్స్ విభాగంలో ఎంజీయూ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ ఆలువాల రవి పర్యవేక్షణలో ×ఎ స్టడీ ఆన్ వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు మెడికల్ ప్రాక్టీషినర్స్ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను తనకు డాక్టరేట్ లభించినట్లు వందన పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని రాంనగర్‌లో గల బీజేపీ కార్యాలయం వద్ద మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. భువనగిరి మండలంలోని ఆకుతోటబావి తండాకు చెందిన కేతావత్ నాగేందర్‌బాబు హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో పనిచేస్తూ భువనగిరి పట్టణంలో నివాసముంటున్నాడు. మంగళవారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి బయట పార్కింగ్ చేసి నిద్రించాడు. బుధవారం ఉదయం చూసేసరికి ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

స్వర్ణగిరిని దర్శించుకున్న టీటీడీ మాజీ ఈఓ

భువనగిరి: స్వర్ణగిరి వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం టీటీడీ మాజీ ఈఓ ధర్మారెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దామోదర్‌గుప్తా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు, విజయలక్ష్మి, గోపికృష్ణ పాల్గొన్నారు.


స్వర్ణగిరి ఆలయంలో ధర్మారెడ్డి

కట్టుకున్నోడే కాలయముడయ్యాడు

- సాగర్ ఎడమ కాల్వలో భార్యను తోసేసి ప్రమాదంగా చిత్రీకరించిన భర్త
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు


వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజు


అనూష (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో గల్లంతై మృతిచెందిన అంగన్‌వాడీ టీచర్‌ను ఆమె భర్తే హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. భార్యపై అనుమానంతోనే ఆమెను తన భర్త కాల్వలో తోసేసి ప్రమాదంగా చిత్రీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజు బుధవారం విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామానికి చెందిన పేరబోయిన సైదులు పదిహేనేళ్ల క్రితం మిర్యాలగూడ పట్టణానికి చెందిన అనూష(35)ను ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. అనూష వేములపల్లి మండలం రావువారిగూడెంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. ఆమెకు కామేపల్లి గ్రామంలో ఇన్‌చార్జి అంగన్‌వాడీ టీచర్‌గా బాధ్యతలు అప్పగించడంతో అక్కడ కూడా పనిచేస్తుంది. సైదులు కామన్ సర్వీస్ సెంటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత కొన్నేళ్లుగా అనూషపై అనుమానం పెంచుకున్న సైదులు ఆమెను వేధిస్తుండేవాడు. దీంతో అనూష కుటుంబ సభ్యులు పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీ నిర్వహించి సైదులుకు నచ్చజెప్పినప్పటికీ అతడిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో ఆమెపై మరింత అనుమానం పెంచుకున్నాడు. ఈ నెల 5వ తేదీన తనను కామేపల్లి గ్రామంలో దించి రావాలని అనూష సైదులును అడగగా.. ఆమెను సైదులు అక్కడ దించి తిరిగి ఇంటికి వచ్చాడు. అక్కడ స్కూల్ ముగిసిన తర్వాత తిరిగి తనను తీసుకెళ్లాలని సైదులుకు అనూష ఫోన్ చేసింది. ఎలాగైనా అనూషను హతమార్చాలని పథకం పన్నిన సైదులు తనకు లేటవుతుందని అక్కడే కొద్ది సమయం వేచి చూడమని భార్యకు చెప్పాడు. చీకటి పడిన తర్వాత కామేపల్లికి చేరుకున్న సైదులు అనూషను బైక్‌పై ఎక్కించుకుని రావులపెంట గ్రామ శివారులో గల నాగార్జునసాగర్ ఎడమ కాల్వ బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లాడు. బైక్ ఆపి అనూషను తీవ్రంగా కొట్టి కాల్వలోకి తోసేశాడు. ఆ తర్వాత బైక్‌ను కాలువలోకి తోసి తాను కూడా కాలువలో దూకి ఈదుకుంటూ బయటకు వచ్చాడు. ప్రమాదవశాత్తు బైక్‌తో పాటు కాల్వలో పడిపోయామని, తన భార్య గల్లంతైందని అందరినీ నమ్మించే ప్రయత్నం చేశాడు. మృతురాలి తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి సైదులును అదుపులోకి తీసుకుని విచారించగా తానే కాల్వలోకి తోసేసినట్లు నిజం ఒప్పుకున్నాడు. కాల్వలో గల్లంతైన అనూష మృతదేహం మంగళవారం గరిడేపల్లి మండలం పొనుగోడు రిజర్వాయర్ పక్కనే చిన్న చెరువులో కనిపించడంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సైదులును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

- శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్


సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న స్వామిగౌడ్

శాలిగౌరారం: సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో సమాజంలోని బహుజనులు ముందుకు సాగాలని శాసనమండలి మాజీ చైర్మన్ కనకమామిడి స్వామిగౌడ్ అన్నారు. శాలిగౌరారం మండలం భైరవునిబండ గ్రామంలో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో రూ.13లక్షలతో నూతనంగా నిర్మించిన గౌడ సంఘం భవనం, సినీనటుడు పంజాల జైహింద్‌గౌడ్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్వామిగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై గౌడ సంఘం భవనాన్ని ప్రారంభించడంతో పాటు సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హక్కుల సాధన కోసం, రాచరిక నిరంకుశత్వ విధానాలకు వ్యతిరేకంగా సర్వాయి పాపన్న చేసిన పోరాటం మరువలేనిదన్నారు. మారుమూల గ్రామంలో సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థానిక గౌడ సంఘం ప్రతినిధులు ముందుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన నాయకులు, ప్రతినిధులను స్థానిక గౌడ సంఘం నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో 800మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, సినీ నటుడు జైహింద్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్, గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపూరి శ్రీకాంత్, పాపన్నసేవ రాష్ట్ర అధ్యక్షుడు పంజాల శ్రవణ్‌కుమార్, గౌడ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ అనంతుల శ్రీనివాస్, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుపెద్ది శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారుడు చెరుకు సుధాకర్, పవన్ సాయి హాస్పిటల్ యజమాని ఆలేటి శ్రీనివాసులు, అయితగోని వెంకన్న, గుజిలాల్ శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యాన్ని తట్టుకోలేక వృద్ధుడి ఆత్మహత్య


నర్సింహ (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణంలో నివాసముంటున్న బసరాజు నర్సింహ (62) సంస్థాన్ నారాయణపురం ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందాడు. గత పదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్న ఆయన మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. నర్సింహ మనవరాలు గమనించి కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి స్వస్థలం వలిగొండ మండలం పులిగిల్ల కాగా 20 సంవత్సరాల క్రితం చౌటుప్పల్‌కు వలస వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు.

యాదాద్రిలో ఆయుధ పూజ


ఆయుధ పూజ చేస్తున్న అర్చకులు, చిత్రంలో ఈఓ భాస్కర్‌రావు, ఎస్పీఎఫ్ కమాండెంట్ త్రినాథ్

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విజయదశమిని పురస్కరించుకొని ఎస్పీఎఫ్ పోలీసులు, సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం అర్చకులు ఆయుధ పూజ నిర్వహించారు. ఆలయ మండపంలో ఎస్పీఎఫ్ పోలీసులు, సిబ్బంది వినియోగించే ఆయుధాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఎస్పీఎఫ్ కమాండెంట్ ఎన్. త్రినాథ్, ఇన్‌స్పెక్టర్ కె. శేషగిరిరావు, సిబ్బంది, ఆలయాధికారులు ఉన్నారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

- విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోయిన యాదగిరి


యాదగిరి (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్ రోడ్డులో నందీశ్వరకాలనీకి చెందిన పుట్ట యాదగిరి(59) తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత సంవత్సరం నుంచి కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా నుంచి చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వరకు విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై వీఐపీ ఎస్కార్ట్ పెట్రోలింగ్ డ్యూటీ చేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్తుండగా రోజువారి విధుల్లో భాగంగా యాదగిరి పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీస్ వాహనంతో సిద్ధంగా ఉన్నారు. కొద్దిసేపటి తర్వాత బాత్‌రూంకు వెళ్లి వస్తానని తనతో పాటు డ్యూటీలో ఉన్న మరో కానిస్టేబుల్‌కు చెప్పి వెళ్లి అక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు జగదీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పిడుగు పడి 12 మేకలు మృతి

- మూసీలో కొట్టుకుపోయిన మరో నాలుగు..

నేరేడుచర్ల: పిడుగు పడి 12 మేకలు మృతి చెందగా, మూసీ నదిలో మరో నాలుగు మేకలు గల్లంతయ్యాయి. నేరేడుచర్ల మండలం పుల్లంబండతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మూసిఒడ్డుతండాకు చెందిన బాణోతు బాలు, బాణోతు హేమ్లా, బాణోతు సైదా రోజుమాదిరిగానే బుధవారం కూడా తమ మేకలను మేపే ందుకు చిల్లేపల్లి వద్ద మూసీ నది వద్దకు వెళ్లారు. సాయంత్రం అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో మేకలు సమీపంలోని చెట్టు కిందకు చేరుకున్నాయి. ఆ చెట్టుపై పిడుగుపడటంతో బాణోతు బాలుకు చెందిన 8 మేకలు, హేమ్లా, సైదాకు చెందిన మేకలు రెండు చొప్పున మృతిచెందాయి. అదేవిధంగా మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బాలుకు చెందిన మరో నాలుగు మేకలు అందులో కొట్టుకుపోయాయి. మృతిచెందిన మేకలు వి లుం రూ.2.50లక్షల వరకు ఉంటాయని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు.

ఆవు మృతి..

మేళ్లచెరువు: మండలంలోని రేవూరు గ్రామంలో బుధవారం సాయంత్రం ఉరుములతో కూడి వర్షం కురిసింది. ఆ సమయంలో గ్రామానికి చెందిన జూనెబోయిన కొండల్ ఆవు గ్రామ పరిధిలోని పొలాల్లో మేత మేస్తుండగా.. ఆవు సమీపంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన ఆవు విలువ సుమారు రూ.60వేల పైచిలుకు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

సరస్వతీ దేవి అవతారంలో అమ్మవారు


అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న పూజారి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం తొమ్మిదో రోజు అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించారు. అనంతరం ప్రాతఃకాల పూజ, పారాయణములు, సరస్వతీ పూజ, సహస్రనామార్చన, పారాయణములు, మధ్యాహ్న పూజలు జరిపించారు. సాయంత్రం 6.30గంటల నుంచి నవావరణ పూజ, నీరాజన మంత్ర పుష్పములు, కుంకుమార్చన, తీర్థ ప్రసాద వినియోగం, సువాసినీ పూజలు చేశారు.

గిరిజన రైతులకు జీవ ఎరువుల పంపిణీ


ఎరువులు పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా ఎంపిక చేసిన గిరిజన రైతులకు బుధవారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో జీవ ఎరువులను పంపిణీ చేసినట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డి. నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమీకృత వ్యవసాయం విధానాలను పాటించడం ద్వారా గిరిజన రైతుల జీవనోపాధిని మెరుగుపడుతుందన్నారు. గిరిజన ఉప ప్రణాళిక కింద నిర్వహించే కార్యక్రమాల గురించి రైతులకు వివరించినట్లు తెలిపారు. అనంతరం గిరిజన రైతులకు సేంద్రియ వ్యవసాయ విధానాలు, జీవ ఎరువులు ఉపయోగించడం వల్ల కలిగే లాభాల గురించి కేవీకే శాస్త్రవేత్త ఎ. కిరణ్ వివరించారు. జీవ ఎరువులు అయిన అజోస్పిరిల్లం, పోస్ఫో బ్యాక్టీరియా, పొటాషియం బ్యాక్టీరియా, జీవ శిలీంధ్రనాశనులైన ట్రైకోడెర్మా, సుడోమోనాస్‌ను 50 మంది రైతులకు రెండు కేజీల చొప్పున పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డి. నరేష్, ఎ. కిరణ్, టి. మాధురి, ఎన్. సుగంధి, గిరిజన రైతులు పానుగోతు రవి, గుగులోతు సురేష్, బాణోతు శ్రీరాములు, లావూరి మంద్య తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా, నల్ల బెల్లం పట్టివేత


సారా తయారు చేస్తున్న వారిని పట్టుకున్న పోలీసులు

నూతనకల్: మండలంలోని బక్కహేమ్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బద్యాతండా, బోటికింద తండాల్లో బుధవారం ఎక్సైజ్ అధికారులు, సివిల్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి 20 కిలోల నల్ల బెల్లం, 10 లీటర్ల నాటుసారా పట్టుకొని 50 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్ఐ మహేంద్రనాథ్, ఎక్సైజ్ సీఐ రజిత తెలిపారు. సారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు మూర్తి, జయప్రకాష్, సురేందర్ బెనర్జీ, సిబ్బంది పాల్గొన్నారు.

తుంగతుర్తిలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాలి


కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి సభ్యులు

తుంగతుర్తి: తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోనే నిర్మించాలని తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని మెయిన్ రోడ్‌పై కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తుంగతుర్తికి మంజూరైన వ్యవసాయ మార్కెట్ యార్డును తిరుమలగిరికి తగిలించారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కూడా తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు స్పందించి ఈ నెల 11న తొండ గ్రామంలో జరగనున్న పాఠశాల శంకుస్థాపన కార్యక్రమాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున ధర్నాలు, రాస్తారోకోలతో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తడకమళ్ల రవికుమార్, గోపగాని శ్రీను, బొంకూరి మధు, బొంకూరి మల్లేష్, సాయికిరణ్, వెంకటేష్, వెంకన్న, ఉప్పుల నాగమల్లు, మల్లికార్జున్, సురేష్, భానుప్రకాష్, మధు, సాయికుమార్, శ్రీకాంత్, సతీష్, ప్రవీణ్, శ్రీను, గోపి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన బియ్యంలో రేషన్ బియ్యం కలపలేదు

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఫ్యామిలీ దాబాలో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యంలో రేషన్ బియ్యం కలపలేదని సూర్యాపేట జిల్లా సివిల్ సప్లై మేనేజర్ టీఎంఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదిన రేణుకా ఎల్లమ్మ ఫ్యామిలీ దాబా వద్ద రెండు లారీల్లో బియ్యాన్ని లోడ్ చేస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి 600 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారని, ఆ బియ్యం శాంపిల్స్‌ను హైదరాబాద్‌కు పంపించగా అందులో రేషన్ బియ్యం కలవలేదని తెలిసిందని తెలిపారు. పట్టుబడిన బియ్యంలో 270 క్వింటాళ్ల నూకలు, రంగు మారిన పచ్చి బియ్యం 170 క్వింటాళ్లు, రంగు మారిన ఉప్పుడు బియ్యం 160 క్వింటాళ్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

మోదినిగూడెం వాసికి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు


అనూష

నకిరేకల్: మండలంలోని మోదినిగూడేనికి చెందిన వలిశెట్టి యాదగిరి కూమార్తె అనూష నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధిచి పలువురికి ఆదర్శంగా నిలిచింది. అనూష గతంలో సివిల్ కానిస్టేబుల్‌గా, కేజీబీవీ, గురుకుల టీజీటీగా ఉద్యోగాలకు ఎంపికైనప్పటికీ ఎందులోనూ జాయిన్ కాకుండా ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలని డీఎస్సీకి సన్నద్ధమయ్యింది. కాగా ఇటీవల విడుదలైన డీఎస్సీ–2024 ఫలితాల్లో ఆమె ఎస్జీటీగా ఉద్యోగం సాధించింది. తన కల నెరవేరడంతో ఆనందంగా ఉందని ఆమె పేర్కొంది.

పశువులను తరలిస్తున్న డీసీఎం పట్టివేత


పట్టుబడిన డీసీఎంలో పశువులు

కట్టంగూర్: అక్రమంగా పశువులను తరలిస్తున్న డీసీఎంను కట్టంగూర్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండల కేంద్రంలోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. సూర్యాపేట నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు డీసీఎంలో తరలిస్తున్న 22 ఆవులు, 36 ఎద్దులను పట్టుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. డీసీఎం డ్రైవర్ కొండ వెంకన్నపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన కూలీ

మునగాల: మండల కేంద్రానికి లంజేపల్లి సైదులు బుధవారం గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు అమర్చేందుకు కూలీగా వచ్చాడు. ఈ క్రమంలో అతడు స్తంభం ఎక్కి లైట్ అమరుస్తుండగా పక్కనే ఉన్న 11కేవీ లైన్ ద్వారా కరెంట్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై స్తంభం పైనుంచి కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రథమ చికిత్స చేయించి హైదారాబాద్‌కు తరలించారు. సైదులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

మూసీ ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- ఒక గేటు ద్వారా దిగువకు నీటి విడుదల


మూసీ నుంచి దిగువకుపోతున్న నీరు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి 1498 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో బుధవారం ప్రాజెక్టు అధికారులు ఒక క్రస్ట్ గేటును పైకి ఎత్తి 659 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 644.40 అడుగుల మేర నీరు ఉంది. ప్రాజెక్టు కుడి కాల్వకు 243 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 170 క్యూసెక్కులు, నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.31 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ

గరిడేపల్లి: మండల కేంద్రంలోని రెండు దుకాణాల్లో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పక్కపక్కనే ఉన్న శ్రీరంగం ప్రసాద్ ఎలక్ట్రికల్ షాపులో రూ.5వేల నగదు, శ్రీరంగం రత్నాకర్ షాపులో రూ.8వేలు, ఆయిల్ ప్యాకెట్లు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు.

జేఎన్‌వీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- 9వ, 11వ తరగతిలో చేరేందుకు అవకాశం
- దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 చివరి తేదీ


చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయం

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను తొమ్మిదో తరగతి, పదకొండో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొమ్మిదో తరగతిలో చేరాలనుకునే విద్యార్థులు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ ఉండాలని, పదకొండో తరగతిలో చేరాలనుకునేవారు ఉమ్మడి జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి చదువుతూ ఉండాలని సూచించారు. తొమ్మిదో తరగతిలో చేరేవారు 01-05-2010 నుంచి 31-07-2012 మధ్య జన్మించిన వారై ఉండాలని, పదకొండో తరగతిలో చేరేవారు 01-06-2008 నుంచి 31-07-2010 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఓపెన్, గ్రామీణ కోటా కింద, పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్బన్ కోటా కింద పరిగణింపబడతారని తెలిపారు. పదో తరగతి చదువుతున్న, నివాసం ఉంటున్న జిల్లా ఒకటే అయినప్పుడు మాత్రమే విద్యార్థి జిల్లాస్థాయి మెరిట్ కోసం పరిగణింపబడతారని పేర్కొన్నారు. దరఖాస్తు చేయటానికి ఈ నెల 30 చివరి తేదీ అని, ప్రవేశ పరీక్ష 2025 ఫిబ్రవరి 8వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ ఫాంను నింపి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తులు జాగ్రత్తగా నింపాలి..

దరఖాస్తు ఫాంను జాగ్రత్తగా నింపాలని, ఒక్కసారి సబ్మిట్ చేసిన తర్వాత మార్చేందుకు అవకాశం లేదని, తప్పుగా నింపితే ప్రవేశ పరీక్షలో ఎంపికైనప్పటికీ అడ్మిషన్ రద్దు చేయబడుతుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అన్ని వివరాలను నింపిన తర్వాత దరఖాస్తును సబ్మిట్ చేయడానికి ముందు ఒకసారి నిర్ధారణ చేసుకుని ప్రింట్ తీసుకుని జాగ్రత్తగా పెట్టుకోవాలని సూచించారు. సరైన మొబైల్ నంబర్‌ను మాత్రమే ఇవ్వాలన్నారు.